

పడకేసిన 'ప్రత్యేక పాలన'!

పల్లెల్లో ప్రత్యేక పాలన పడకేసింది. ప్రత్యేక అధికారులు పనిభారం కారణంగా గ్రామాలను సందర్శించడం లేదు. 10లో▸



ఆశాజనకంగా పంటలు

మృగశిర కార్తెలో కురిసిన వర్షంతో రైతన్నలు సాగు పనులు ముమ్మరం చేశారు. ఖాలాల్లో విత్తులు విత్తారు. 10లో▸



పత్తి సాగే అధికం!

మూడేళ్లుగా పత్తి పంటకు మార్కెట్లో డిమాండ్ పెరగడంతో రైతులు పత్తి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. 11లో▸

న్యూస్‌రీల్

నేడు అప్రెంటిస్‌షిప్ మేళా

మర్పల్లి: స్థానిక ఐటీఐ కళాశాలలో సోమవారం అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎజాజ్ మసియొద్దీన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు నిర్వహించే ఈ మేళాకు ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు, ఆన్‌లైన్‌లో అప్రెంటిస్‌షిప్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న ఫారంతో పాటుగా ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు రెండు జిరాక్స్‌లతో హాజరవ్వాలని సూచించారు.

ఆపరేషన్ ముస్కాన్-10లో 30మందికి విముక్తి

ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: ఆపరేషన్ ముస్కాన్-10లో భాగంగా ఇప్పటికి 30మంది బాల కార్మికులకు విముక్తి కల్పించాలని ఎస్పీ నారాయణరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తప్పిపోయిన పిల్లలు, బాలకార్మికులు, అక్రమ రవాణాకు గురవుతున్న చిన్నారులను రక్షించి పునరావాసం కల్పించడమే ఆపరేషన్ ముస్కాన్-10 లక్ష్యమన్నారు. జూలై 1న ప్రారంభమైన ఈ ఆపరేషన్ జూలై 31వరకు కొనసాగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా సబ్ డివిజన్ వారీగా లేబర్, ఉమెన్, చైల్డ్ వెల్ఫేర్, ఎన్‌జీఓ పోలీసు అధికారులతో కలిపి మూడు టీంలు ఏర్పాటు చేశామని వివరించారు. చిన్నారుల బాల్యాన్ని చిదిమేస్తున్న బాలకార్మిక వ్యవస్థ నిర్మూలించేందుకు ప్రతీ ఒక్కరు కలిసి రావాలని కోరారు. బాలకార్మికులు కనిపిస్తే డయల్-100 గాని, పోలీస్ కంట్రోల్ రూమ్ 8712670056 నంబర్‌కు గాని సమాచారం అందించాలని ఎస్పీ నారాయణరెడ్డి కోరారు.

డ్రంకెన్‌డ్రైవ్ నేరం

ఏఎస్ఐ సూర్యనారాయణ



బాస్‌పల్లిలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

దోమ: మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఏఎస్ఐ సూర్యనారాయణ హెచ్చరించారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని బాస్‌పల్లిలో శాంతి భద్రతలు, రోడ్డు ప్రమాదాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వాహనదారులు సంబంధిత ధ్రువపత్రాలతో ప్రయాణాలు సాగించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, ఫోర్ వీలర్ నడిపే వారు సీట్ బెల్ట్ తప్పక ధరించాలన్నారు. తగాదాలు, గొడవలతో ఇబ్బందుల పాలు కావద్దని సూచించారు. అనుమానితులు కనిపిస్తే డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు.

ఒక్కటైన ప్రేమ జంట

- యువకుడి తల్లిదండ్రులపై యువతి కుటుంబీకుల వేధింపులు
- ప్రేమ జంట మారక్షణలోనే ఉంది: ఎస్ఐ విఠల్‌రెడ్డి

తాండూరు రూరల్: పారిపోయిన ప్రేమ జంట ఒక్కటైంది. విషయం తెలుసుకున్న యువతి తల్లిదండ్రులు యువకుడి కుటుంబీకులను వేధింపులకు గురి చేయడంతో వారు కరన్‌కోట్ పోలీసులను ఆశ్రయించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు హైదరాబాద్‌లోని ఓ పెట్రోల్ పంప్‌లో పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన యువతి ఉన్నత చదువుల నిమిత్తం నగరానికి వచ్చింది. వీరిద్దరి పరిచయం కాస్త ప్రేమగా మారింది. వారం రోజులుగా ఇద్దరూ కనిపించడం లేదు. ఫోన్‌లు సైతం స్విచ్ఛాఫ్ చేశారు. దీంతో యువతి కుటుంబ సభ్యులు యువకుడి తల్లిదండ్రులను వేధించ సాగారు. దీంతో వారు కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా ఎస్ఐ విఠల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రేమ జంట వివాహం చేసుకున్నారు. ఇదే విషయమై హైదరాబాద్‌లోని చిలకలగూడ ఠాణాలో కేసు నమోదయిందని వారిద్దరూ మేజర్లు ప్రస్తుతం మారక్షణలోనే ఉన్నారని చెప్పారు. యువకుడి తల్లిదండ్రులకు సైతం రక్షణ ఇస్తామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఇబ్రహీంపట్నం రూరల్: రేషన్ బియ్యాన్ని అక్రమంగా దాచారన్న సమాచారంతో ఎస్‌ఓటీ పోలీసులు గోదాంలో సోదాలు చేశారు. ఈ సోదాల్లో భారీగా నిల్వ ఉంచిన బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సత్యనారాయణ కథనం ప్రకారం.. ఆదిబట్ల మున్సిపాలిటీ మంగళ్‌పల్లి సమీపంలోని పాడుబడ్డ రైస్‌మిల్లులో భారీగా రేషన్‌బియ్యం నిల్వ ఉంచారన్న సమాచారంతో ఆదివారం పోలీసులు సోదాలు చేసి 20 టన్నుల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. భువనగిరికి చెందిన పులుసొత్తు నరేష్‌ను అరెస్టు చేశారు. ప్రేమ్ అనే మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. బియ్యాన్ని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శాలివాహన బోనం



రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్ వద్ద శాలివాహన(కుమ్మరులు) సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బోనాల ఉత్సవాలకు కొడంగల్ నియోజకవర్గం నుంచి సంఘం సభ్యులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మహిళలు బోనాలెత్తి అమ్మవారికి సమర్పించారు.

– బొంరాస్‌పేట

కల్తీ జోరు.. రైతు బేజారు

ఎరువులు, పురుగు మందుల వినియోగంపై అవగాహన అవసరం

- కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి
- అన్నదాతలకు అధికారుల సూచనలు



దుద్యాల్: వానాకాలం, యాసంగి సీజన్‌లలో ఎరువులు, పురుగు మందుల వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో మార్కెట్‌లోకి నకిలీవి వచ్చే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. లేదంటే మోసపోయే అవకాశం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. పంట దిగుబడి అధికంగా వస్తుందని నమ్మించి కొంత మంది అనుమతి లేని కంపెనీల ఉత్పత్తులైన కల్తీ ఎరువులు, పురుగు మందులు రైతులకు అంటగట్టే అవకాశం ఉంది. తక్కువ ధరకే పురుగు మందులు, ఎరువులు వస్తున్నాయని కొనుగోలు చేయొద్దు. కొనుగోలు చేసినప్పుడు బిల్లులు తప్పక తీసుకోవాలి. లైసెన్స్ లేని దుకాణాలు, దళారుల వద్ద కొనుగోలు చేయరాదు.

అనుమానం వస్తే ఫిర్యాదు చేయండి

లైసెన్స్ లేకుండా విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలి. సరుకు లాట్ నెంబర్, తయారు తేదీ, ఏ రకం వంటి విషయాలను పరిశీలించాలి. దుకాణాదారుడు, డీలర్ సంతకం చేసిన ఒరిజినల్ బిల్లును తప్పనిసరిగా తీసుకోవాలి. విత్తనాల సంచులపై సీలు విప్పినట్లు అనుమానం వస్తే వాటిని వాటిని కొనరాదు. అధికారుల పరిశీలనలో కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు నకిలీవని తేలితే స్థానిక డీలర్‌పై కేసు నమోదు చేసి రైతులకు న్యాయం చేసే అవకాశం ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

అధిక దిగుబడి ఆశకు కొనుగోలు

కొడంగల్, బొంరాస్‌పేట, దుద్యాల్, దౌల్తాబాద్ మండలాలకు చెందిన రైతులు కొడంగల్‌లోని ఫర్టిలైజర్ దుకాణంలో వరి విత్తనాలను అధిక దిగుబడి వస్తుందని చెప్పడంతో వందలాది మంది రైతులు కొనుగోలు చేశారు. పంటకాలం పూర్తైన తర్వాత ఎకరాకు 10క్వింటాళ్ల ధాన్యం రావడంతో మోసపోయామని రైతులు జూన్‌లో పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. అధికారులు కల్పించుకుని రైతులకు న్యాయం చేసేందుకు యత్నించారు.



వరి విత్తనాలు కొనుగోలు చేసిన రసీదు

కేసు నమోదుకు అవకాశం



ప్రభుత్వ అనుమతి ఉన్న దుకాణాల్లోనే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేయాలి. ఆయా దుకాణాల్లో కొనుగోలు సమయంలో షాపు యజమాని సంతకం చేసిన బిల్లులు తీసుకోవాలి. క్రిమి సంహారక మందులు కొనుగోలు చేసే సమయంలో డబ్బాలపై ఉన్న వివరాలను పరిశీలించాలి. అర్థం కాకపోతే తెలిసిన వారికి చూపించాలి. మందుల పిచికారి గురించి ముద్రించిన కరపత్రాలు తీసుకోవాలి. మందులు, విత్తనాలు కొనుగోలు చేసిన డబ్బాలను, సంచులను పంట దిగుబడి చేతికి వచ్చేంత వరకు భద్రపర్చుకోవాలి. నష్టం వాటిల్లితే సంబంధిత డీలర్‌పై కేసు నమోదు చేసే అవకాశం ఉంటుంది.

– గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి, వికారాబాద్

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు

- ప్రభుత్వ ల్యాబ్‌ల్లో ఉచిత పరీక్షలు
- పరిశుభ్రతే పరిష్కార మార్గం
- 'సాక్షి'తో జిల్లా వైద్యాధికారి పల్వాన్‌కుమార్



వికారాబాద్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమ్తంగా ఉండాలి.. వైద్యారోగ్య శాఖా పరంగా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని జిల్లా వైద్యాధికారి పల్వాన్‌కుమార్ అన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో హాస్టల్ విద్యార్థులు వ్యాధులబారిన పడడం.. ప్రజలు సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలను 'సాక్షి' ఇంటర్వ్యూలో వివరించారు.

ఫీవర్ సర్వే పూర్తి

సీజన్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నాం. గ్రామాల్లో, మున్సిపాలిటీలో వార్డుల్లో, జిల్లా వ్యాప్తంగా టీంలు ఏర్పాటు చేసి ఫీవర్ సర్వే నిర్వహించాం. అక్కడక్కడ మామూలు జర్వాలున్నట్లు గుర్తించాం. గతంతో పోలిస్తే విష జ్వరాలు, వైరల్ ఫీవర్స్ తక్కువగా నమోదయ్యాయి. 2022లో 230 డెంగీ కేసులు నమోదవ్వగా.. గతేడాది మూడు నమోదయ్యాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు డెంగీ జర్వాలు రాలేదు. ఏఎన్‌ఎంలు, పీహెచ్‌సీ వైద్యులు, పట్టణ, పల్లె బస్తీ దవాఖానాల్లో విధులు నిర్వహిస్తున్న డాక్టర్లు, సిబ్బందికి వారు తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే దిశానిర్దేశం చేశాం. క్షేత్ర స్థాయిలో చేపడుతున్న కార్యక్రమాలపై క్రమం తప్పకుండా రివ్యూలు చేస్తున్నాం.

ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు

వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. సీజన్ వ్యాధులపట్ల వైద్యులు, సిబ్బంది అవలంబించాల్సిన వ్యూహాలను ఎప్పటికప్పుడు సూచిస్తున్నాం. హాస్టల్ విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న నేపథ్యంలో ఏఎన్‌ఎంలు, పీహెచ్‌సీ వైద్యులు ప్రతీరోజు విజిట్ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. హాస్టల్ పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని సూచించాం. ఏఎస్ఎంలు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ప్రతీ శుక్రవారం సంస్థలు, కార్యాలయాలు, ప్రజలు డ్రైడే పాటించేలా చూస్తున్నాం. స్వయం సహాయక సంఘాల ద్వారా డ్రైడేపై మహిళలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఇమ్యునైజేషన్, ఆస్పత్రుల్లో ప్రసవాలు, ల్యాబ్‌లలో టెస్టులు, ఏఎన్‌సీ, పీఎన్‌సీ చెకప్‌లు యథాతథంగా సాగేలా చర్యలు తీసుకుంటున్నాం. పరిశుభ్రతతోనే సీజనల్ సమస్యలను అధిగమించగలం.

24 గంటల వైద్య సదుపాయం

జిల్లాలో 24 పీహెచ్‌సీలు, 134 సబ్ సెంటర్లున్నాయి. ఇందులో ఏడు పీహెచ్‌సీల్లో 24గంటల వైద్య సదుపాయం ఉంది. ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రితో పాటు ఏడు పీహెచ్‌సీలలో కాన్పులు చేస్తున్నాం. హైరిస్క్ కేసులుంటే జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నాం. జిల్లాలోని ఆర్ఎంపీలు, పీఎంపీలు పరిధి దాటి వ్యవహరిస్తే.. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం. ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించొద్దు. వైద్యులు ప్రిస్క్రిప్షన్‌లో మందులు అర్థమయ్యేలా రాయాలి.

ధరల పట్టిక తప్పనిసరి

ప్రైవేటు ల్యాబ్‌ల నిర్వాహకులు నిబంధనలు పాటించకుండా.. టెస్టుల పేరిట అధిక డబ్బులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. ల్యాబ్ నిర్వాహకులు టెస్టుల ధరల పట్టిక ఏర్పాటు చేయాలి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ల్యాబ్‌లలో దాదాపు 48 రకాల టెస్టులు ఉచితంగా చేసుకునే వీలుంది. టెస్టుల కోసం జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేదు. అందుబాటులో ఉన్న పీహెచ్‌సీలలో రక్త నమూనాలిస్తే టెస్టులు చేసి రిజల్టు ఫోన్‌కు పంపిస్తాం.



ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయం

'స్థానిక' సమరం ఎప్పుడో?

- ముగిసిన మండల, జిల్లా పరిషత్‌ల పదవీకాలం
- ప్రారంభమైన ప్రత్యేకాధికారుల పాలన
- ఎన్నికల కోసం ఆశావహుల ఎదురుతెన్నులు
- బరిలో దిగేందుకు నేతల ఉత్సాహం

ఆమనగల్లు: స్థానిక సంస్థల ఎన్నికలకు ఆశావహులు ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం జనవరిలో పూర్తి కాగా ఈ నెల 4తో మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల పదవీకాలం కూడా పూర్తయింది. ఆయా పాలకవర్గాల పదవీకాలం పూర్తికాకముందే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ప్రారంభించి పూర్తి చేయాల్సి ఉన్నా ఎన్నికల నిర్వహణపై ఇంకా దృష్టి సారించలేదు. ఇప్పటికే గ్రామ పంచాయతీలకు, మండల పరిషత్‌లకు ప్రత్యేకాధికారులను నియమించింది.

ప్రారంభంకాని ప్రక్రియ

గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌ల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఇంకా సన్నాహాలు ప్రారంభించలేదు. పదవీకాలం పూర్తి కావడంతో ప్రత్యేకాధికారులను నియమించి ఎన్నికలను వాయిదా వేసింది. స్థానిక ఎన్నికల నిర్వహణను చేపట్టాల్సి ఉన్నప్పటికీ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడం.. అంతలోనే ఎమ్మెల్సీ, లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేసింది. లోక్‌సభ ఎన్నికల అనంతరం ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించినప్పటికీ వివిధ కారణాలతో ఆలస్యం అవుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలపై స్పష్టత లేకపోవడంతో నిర్వహణకు అడుగులు పడటం లేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీసీలకు రిజర్వేషన్ల పెంపు చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. అలాగే కుల గణన చేపడతామని చెప్పినప్పటికీ ఇంకా దీనిపై స్పష్టత రాలేదు. రిజర్వేషన్ల పెంపు, బీసీ కులగణనతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో మార్పులు జరిగే అవకాశం ఉంది. దీనిని బట్టి చూస్తే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఇప్పట్లో జరిగే అవకాశం కనిపించడం లేదు.

పోటీకి నాయకుల ఏర్పాట్లు

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆశావహులు ఉత్సాహం చూపుతున్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలుగా పోటీ చేయడానికి వివిధ పార్టీల్లోని నాయకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేసిన మండల, గ్రామస్థాయి నాయకులు స్థానిక సంస్థల్లో పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నాయకులు ఎన్నికలపై ఆసక్తితో ఉన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీల ఎన్నికలకు పార్టీ గుర్తుపై ఎన్నికలు నిర్వహించనుండటంతో ఆయా పార్టీల నుంచి పోటీ చేయడానికి నేతలు సిద్ధమవుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతల మధ్య పోరు రసవత్తరంగా సాగే అవకాశం ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడమే తరువాయి పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు. స్థానిక సంస్థలకు షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని వివిధ పార్టీల నాయకులు కోరుతున్నారు. ప్రత్యేకాధికారుల పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతారని వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

'విస్తరణ'.. నత్తనడకన

44వ జాతీయ రహదారి విస్తరణకు రూ.500 కోట్లు

- శంషాబాద్ నుంచి కొత్తూరు వరకు ఆరు లేన్లు
- నెమ్మదిగా కొనసాగుతున్న పనులు
- తరచూ తప్పని ట్రాఫిక్ తిప్పలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

షాద్‌నగర్: జాతీయ రహదారిపై ప్రయాణం మరింత సాఫీగా సాగేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ట్రాఫిక్ సమస్య, వాహనాల రద్దీని నియంత్రించి ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రహదారి విస్తరణ పనులు చేపట్టారు. రూ.500 కోట్లతో శంషాబాద్ నుంచి కొత్తూరు వరకు చేపట్టిన 44వ జాతీయ రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

వాహనాలతో నిత్యం రద్దీ

శంషాబాద్ నుంచి కొత్తూరు మీదుగా 44వ జాతీయ రహదారి ప్రస్తుతం నాలుగు లేన్లుగా ఉంది. శంషాబాద్‌లో అంతర్జాతీయ విమానాశ్రమం ఏర్పాటైన తర్వాత ఈ రహదారిపై వాహనాల రాకపోకలు అధికమయ్యాయి. హైదరాబాద్ నుంచి విమానాశ్రయానికి.. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు ఇక్కడి నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతి రోజు వేల సంఖ్యలో వాహనాలు వచ్చివెళ్తుండడంతో ఈ రహదారి ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. వాహనాల రద్దీని నియంత్రించి ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు శంషాబాద్ సమీపంలోని తొండుపల్లి నుంచి షాద్‌నగర్ నియోజకవర్గం కొత్తూరు వై జంక్షన్ వరకు ఉన్న నాలుగు లేన్ల జాతీయ రహదారిని ఆరు లేన్లుగా మార్చేందుకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రూ.500కోట్లు మంజూరు చేసింది.



జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు (ఫైల్)

ఆగుతూసాగుతూ పనులు

సుమారు రెండేళ్ల క్రితం ప్రారంభమైన రహదారి విస్తరణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుండడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రోడ్డు ఇరుగ్గా ఉన్న ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా సాయంత్రం వేళ ఈ రహదారిపై భారీగా ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కల్వర్టులు, చిన్న చిన్న బ్రిడ్జిలు, మురుగు కాల్వలు, సర్వీసు రోడ్డు తదితర పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.



కొత్తూరు శివారులో కొనసాగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులు

45 మీటర్ల వెడల్పుతో..

ప్రస్తుతం డివైడర్ నుంచి అటు 22.5 మీటర్లు, ఇటు 22.5 మీటర్ల రహదారి నిర్మిస్తున్నారు. రహదారి చివరన సర్వీసు రోడ్డుతో పాటు మురుగు నీటి కాల్వలు, బస్ షెల్టర్లు, తాగునీటి వసతి, ఎస్‌ఓఎస్ ఫోన్ల వంటి సదుపాయాలు సైతం కల్పించనున్నారు. 12 కిలోమీటర్ల రహదారిలో ఐదు భారీ బ్రిడ్జిలు, నాలుగు చిన్న బ్రిడ్జిలను నిర్మిస్తున్నారు.

త్వరగా పూర్తి చేయాలి



జాతీయ రహదారి విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలి. పనులు నత్తనడకన సాగుతుండటంతో వాహనదారులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సత్వరం పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలి.

– నర్సింహ, వాహనదారుడు, షాద్‌నగర్

తరచూ ట్రాఫిక్ ఇక్కట్లు



శంషాబాద్ నుంచి కొత్తూరు వరకు తరచూ ట్రాఫిక్ జాం అవుతోంది. అత్యవసర పనుల మీద ఈ రహదారి గుండా వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. గంటల తరబడి రోడ్డుపై వాహనాలు ఆగిపోతున్నాయి.

– శ్రీకాంత్, వాహనదారుడు, షాద్‌నగర్

క్లుప్తంగా

ప్రైవేటు విద్యా సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

వికారాబాద్‌: ప్రైవేటు విద్యా సంస్థల్లో బీసీ విద్యార్థులకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించి, ఉచితంగా అడ్మిషన్లు ఇవ్వాలని బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తెల్లి లక్ష్మణ్‌ యాదవ్‌ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. చాలా కాలంగా బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు స్కాలర్‌షిప్‌లు అందడం లేదని పేర్కొన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలంటూ విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు స్కాలర్‌షిప్‌ను విడుదల చేయాలని కోరారు. అలాగే గురుకుల వసతి గృహాలకు పక్కా భవనాలు నిర్మించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

చాక్లెట్‌ ఇప్పిస్తానని పిలిచి..

- బాలికపై లైంగిక దాడి
- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

ఇబ్రహీంపట్నం రూరల్‌: ఆరుబయట ఆడుకుంటున్న బాలికను చాక్లెట్‌ ఇప్పిస్తానని పిలిచి ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడిన అమానుష సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సత్యనారాయణ కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్‌ గ్రామానికి చెందిన బోడ నర్సింహ (50) కూలి పని చేస్తుండేవాడు. అదే గ్రామానికి చెందిన బాలిక (8) ఆదివారం ఆరుబయట ఆడుకుంటోంది. చిన్నారికి పది రూపాయల నోటు ఇచ్చి చాక్లెట్‌ ఇప్పిస్తానని ఎత్తుకొని ఇంట్లోకి తీసుకెళ్లాడు. ఆమెపై లైంగిక దాడికి పాల్పడగా చిన్నారికి రక్తస్రావం కావడంతో కేకలు వేసింది. విషయం తల్లికి తెలియడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు నర్సింహను అరెస్టు చేసి, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాలికను ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు.

విమానాశ్రయంలో నగలు మాయం

శంషాబాద్‌: శంషాబాద్‌ విమానాశ్రయంలో నగలు మాయమయ్యాయని ఓ మహిళ ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈసీఐఎల్‌కు చెందిన ఓ మహిళ భర్తతో కలిసి లండన్‌ నుంచి ఆదివారం ఉదయం శంషాబాద్‌ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. బయటికి వచ్చిన సమయంలో బ్యాగులో ఉన్న ఏడు తులాల నగలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

జూదరుల అరెస్టు

ఇబ్రహీంపట్నం రూరల్‌: మార్కెట్‌ యార్డు గోదాంలో జూదం ఆడుతున్న పలువురిని ఎస్‌ఓటీ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో గోదాంను అద్దెకు తీసుకొని కొందరు పేకాట ఆడుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మహేశ్వరం జోన్‌ ఎస్‌ఓటీ, పట్నం పోలీసులు సంయుక్తంగా గిడ్డంగిపై దాడి చేశారు. ఈ దాడిలో గోదాం నిర్వాహకులు కర్రె సిద్దప్ప, ముత్యాల కృష్ణ, భర్తల శంకర్‌, ఆకుల రాజు, గాజుల గోపాల్‌ పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.12,830 నగదు, 5 సెల్‌ఫోన్లు, సెట్‌ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించనున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

ఉప్పల్‌: ఆర్థిక ఇబ్బందులు తాళ లేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఉప్పల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. రామంతాపూర్‌ గృహకల్ప ప్రాంతానికి చెందిన జోషి రవికుమార్‌(40) కియా మోటర్స్‌లో పని చేస్తున్నాడు. శనివారం విధులు ముగించుకుని ఇంటికి వచ్చి ఆకలిగా ఉంది వంట చేయాలని భార్య నిషా జోషికి చెప్పాడు. దీంతో ఆమె వంట చేయడంలో నిమగ్నమయింది. రవికుమార్‌ బెడ్‌ రూంలోకి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య తలుపు కొట్టినా ఎంతకూ తీయకపోవడంతో పక్కింటికి వెళ్లి కిటికిలోంచి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతున్నాడు. తలుపు పగుల గొట్టి వెళ్లి రవికుమార్‌ను దించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే కుమార్‌ మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. దీంతో భార్య నిషా జోషి ఉప్పల్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆర్థిక సమస్యలతో బలవన్మరణానికి పాల్పడినట్లు పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పడకేసిన 'ప్రత్యేక పాలన'!



బషీరాబాద్‌ గ్రామ పంచాయతీ ఎదుట మురుగునీటి గుంత

> **ఖాతాల్లో చిల్లిగవ్వ లేవు**
>
> 
>
> నిధుల కొరత వలన పంచాయతీల్లో ఏ పనులు చేయలేక పోతున్నాం. పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంతో వారు పని చేయడం లేదు. దీంతో సమస్యలు అధికమయ్యాయి. మండలం పరిధి పది పంచాయతీల ఖాతాల్లో చిల్లిగవ్వ లేవు. అయినా కార్యదర్శులతో పనులు చేయించే ప్రయత్నం చేస్తున్నాం. వీధిలైట్లు లేవన్న ఫిర్యాదులు వస్తున్నాయి. సీజనల్‌ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.
>
> – రాఘవులు, ఎంపీడీఓ, బషీరాబాద్‌

అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం

- జనవాసాల్లో పేరుకుపోతున్న మురుగు
- విజృంభిస్తున్న దోమలు, ఈగలు
- వెలగని వీధి దీపాలు.. చీకట్లో మగ్గుతున్న గ్రామాలు

బషీరాబాద్‌: పల్లెల్లో ప్రత్యేక పాలన పడకేసింది. స్థానిక ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగియడంతో వారి స్థానాల్లో ప్రభుత్వం మండల స్థాయి ప్రత్యేక అధికారులను నియమించింది. కానీ పనిభారంతో వారు వారానికి ఒక్కరోజు కూడా గ్రామాలను సందర్శించడం లేదు. వారి బాటలోనే జీపీ కార్యదర్శులు పయనిస్తున్నారు. ఇక పారుశుద్ధ్య కార్మికులు, వాటర్‌మెన్‌లకు మూడు, నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో వారూ నిరుత్సాహంగా ఉన్నారు. ఫలితంగా దేశ ప్రగతికి పట్టుకొమ్మ లాంటి పల్లెలు అపరిశుభ్రతకు ఆనవాలుగా గుర్తింపు పొందాయి.

నిర్లక్ష్యపు నీడలో పల్లెలు

బషీరాబాద్‌ మండలంలో 36 గ్రామ పంచాయతీలు, 5 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ ఎంపీడీఓ, ఎంపీఓ, తహసీల్దార్‌, డిప్యూటీ తహసీల్దార్‌, వ్యవసాయ అధికారి, మండల వెటర్నరీ అధికారులు అన్ని జీపీలకు ప్రత్యేక అధికారులుగా కొనసాగుతున్నారు. కానీ వారి పర్యవేక్షణ లోపం వలన పల్లెలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. చిన్నపాటి వర్షం పడినా ముందుకు సాగని మురుగు కాలువల కారణంగా రోడ్లు, వీధుల్లో నీరు నిలిచిపోతోంది. అంతర్గత రోడ్లు మరీ అధ్వానంగా ఉండడంతో ఇళ్ల మధ్యే మురుగు జలాలు నిలుస్తున్నాయి. దీంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయి.

చేతులెత్తేసిన అధికారులు

సీజనల్‌ వ్యాధుల కాలం.. లోపించిన పారిశుద్ధ్యంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పాత పైప్‌లైన్ల లీకేజీ కారణంగా తాగునీరు కలుషితం అవుతున్నట్లు పలువురు పేర్కొన్నారు. నవల్గ, మైల్వార్‌, పర్వత్‌పల్లి, కొర్విచెడ్‌, మంతట్టి, బాబునాయక్‌తండా, వాల్యానాయక్‌తండా, బోజ్యానాయక్‌తండా, తార్యానాయక్‌తండా, కొత్లాపూర్‌, దామర్‌చెడ్‌, కంసాన్‌పల్లి, జీవన్గీ గ్రామాల్లో పారుశుద్ధ్యం లోపించింది. మండల కేంద్రం బషీరాబాద్‌తో పాటు 15 గ్రామాల్లో పూర్తిస్థాయిలో రాత్రి వేళలో వీధిలైట్లు వెలగక అంధకారంలో మగ్గుతున్నాయి. మండల కేంద్రంలో 200కు పైగా వీధి దీపాలు అవరమున్నా నిధులు లేక అధికారులు చేతులెత్తేశారు.

వెంటాడుతున్న సీజనల్‌ వ్యాధులు

వానాకాలం ప్రారంభం అయ్యే నాటికి ప్రభుత్వం ఒక్కో జీపీకి రూ.10 వేలు పారిశుద్ధ్యం నిధులు ఇచ్చేది. రెండేళ్లగా ఇవి రాకపోవడంతో బ్లీచింగ్‌ పౌడర్‌ను కూడా కొనలేని స్థితికి పంచాయతీలు చేరాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాలన్నీ చిత్తడిగా మారాయి. ముఖ్యంగా గిరిజన తండాల్లో పారుశుద్ధ్య సమస్య ఎక్కువగా ఉంది. మరుగు దొడ్లు కూడా వందశాతం ఏ గ్రామంలో పూర్తికాలేదు. దీంతో జనాలు బహిర్భూమికి రోడ్లపక్కకే వెళ్తుంటారు. తద్వారా కలరా వంటి అంటు రోగాలు ప్రబలే ప్రమాదం ఉంది. భగీరథ నీరు గ్రామాలకు పూర్తిస్థాయిలో సరఫరా కావడంలేదు. సరఫరా అయిన ఊర్లలో ఆ నీరు తాగితే దురద వస్తోందని, వాటిని తాగడం మానేశామని స్థానికులు తెలిపారు. బోరు నీటినే తాగుతున్నారు.

దారి పొడవునా గుంతలే



బుద్దారం రోడ్డు దుస్థితి

పెద్దేముల్‌: ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. 'దారి'పొడవునా గుంతలు ఏర్పడి ప్రమాదాలకు చిరునామాగా నిలిచాయి. పెద్దేముల్‌ మండలం తాండూరు–సంగారెడ్డి, తాండూరు–హైదరాబాద్‌, తాండూరు–జహీరాబాద్‌ ప్రధాన రహదారులు గోతులు ఏర్పడి అధ్వానంగా ఉన్నాయి. దీంతో చినుకు పడితే చిత్తడిగా మారడంతో, గుంతల్లో నీరు చేరి వాహనదారులను ప్రమాదాల బారిన పడేలా చేస్తున్నాయి. పెద్దేముల్‌ మండలం గాజీపూర్‌ నుంచి బుద్దారం రోడ్డులో గంతలు ఏర్పడి, రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. గాజీపూర్‌ వంతెన పనులు నామ మాత్రంగా చేసి, వంతెనకు ఇరువైపులా బీటీ చేయకుండా ప్రారంభించారని, వర్షం పడితే గుంతలు పడి అందుల్లో వర్షం నీరు చేరి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గుంతలు పడిన రహదారులకు మరమ్మతు చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయమై ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫోన్‌ చేయగా అందుబాటులోకి రాలేదు.



గాజీపూర్‌ వంతెన వద్ద బురదమయం

కౌన్సిలర్‌ రత్నమాల రాజీనామా

ఆమోదించని అధికారులు



తాండూరు: తాండూరు మున్సిపల్‌ కౌన్సిలర్‌ పటోళ్ల రత్నమాల తన పదవికి రాజీనామా చేశారు. గతంలో రత్నమాల మున్సిపల్‌ వైస్‌ చైర్‌పర్సన్‌గా కొనసాగారు. 2020లో జరిగిన ఎన్నికలో మరోసారి 10వ వార్డు నుంచి భారీ మెజార్టీతో గెలిచి రికార్డు సృష్టించారు. భర్త నర్సింహులు సైతం కౌన్సిలర్‌గా పని చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో 10వ వార్డు నుంచే కాకుండా సాయిపూర్‌ ప్రాంతం నుంచి కాంగ్రెస్‌ పార్టీకి భారీ మెజార్టీ వచ్చేలా కీలకంగా పని చేశారు. పార్లమెంట్‌ ఎన్నికలో తన వార్డు నుంచి కాంగ్రెస్‌ పార్టీకి మెజార్టీ కట్టబెట్టారు. అయితే ఇటీవల నామినేటెడ్‌ పదవుల విషయంలో తమను సంప్రదించకుండానే 11వ వార్డు కౌన్సిలర్‌ నీరజా భర్త పటోళ్ల బాల్‌రెడ్డికి తాండూరు మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ పదవి కట్టబెట్టడంపై వ్యతిరేకించారు. తీవ్ర మనస్తాపానికి గురైన పటోళ్ల దంపతులు మున్సిపల్‌ కౌన్సిలర్‌ పదవికి వారం రోజుల క్రితం రాజీనామా చేసినట్లు తెలిపారు. ఈ విషయమై మున్సిపల్‌ కమిషనర్‌ విక్రమ్‌ సింహారెడ్డిని వివరణ కోరగా 10వ వార్డు కౌన్సిలర్‌ పటోళ్ల రత్నమాల తన రాజీనామా లేఖను సమర్పించిన విషయం వాస్తవమేనని, రాజీనామా ఆమోదించడంలో పలు మార్గదర్శకాలు ఉన్నాయన్నారు. మున్సిపల్‌ చట్టంలో ఉన్న నిబంధనల ప్రకారం కౌన్సిల్‌ సమావేశం నిర్వహించి, నిర్ణయం తీసుకొంటామని కమిషనర్‌ వెల్లడించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



యాదగిరి(ఫైల్‌)

షాద్‌నగర్‌రూరల్‌: అనుమానాస్పద స్థితిలో షాద్‌నగర్‌ వాసి నాగర్‌కర్నూల్‌ జిల్లాలో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ఫరూఖ్‌నగర్‌ మండల పరిధి వెలిజర్ల గ్రామానికి చెందిన దొడ్డి యాదగిరి(38) గ్రామంలో ఫొటో స్టూడియో నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. యాదగిరికి కొంత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నెల 2న కుటుంబ సభ్యులతో కలిసి మహబూబ్‌నగర్‌ జిల్లా నవాబ్‌పేట మండలం ఫతేపూర్‌ మైసమ్మ దేవాలయానికి వచ్చారు. 4న తన బావతో దేవునిపడకల్‌ వెళ్లాడు. మరుసటి రోజు ఎవరికి చెప్పకుండా అచ్చంపేటకు వెళ్లాడు. దీంతో అతని కోసం కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఫలితం కనిపించలేదు. ఈ క్రమంలో నాగర్‌కర్నూల్‌ జిల్లా బల్మూర్‌ మండలం పోలిశెట్టిపల్లి గ్రామశివారులో గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బల్మూర్‌ పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి, మృతుడు యాదగిరిగా గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు.

ఎక్సైజ్‌ శాఖ విస్తృత దాడులు

బెల్లం పానకం ధ్వంసం

- పలు కేసులు నమోదు

కడ్తాల్‌: గుడుంబా రహిత తెలంగాణే లక్ష్యంగా ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌, ఎన్‌ఫోర్స్‌మెంట్‌ శాఖల ఆధ్వర్యంలో దాడులు చేసినట్లు ఎక్సైజ్‌ సీఐ బద్యానాథ్‌ చౌహాన్‌ తెలిపారు. గుడుంబా తయారు చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం, కడ్తాల్‌, మాడ్గుల్‌, ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల పరిధి పలు గ్రామాలు, తండాల్లో ముమ్మరంగా దాడులు నిర్వహించినట్లు సీఐ వెల్లడించారు. ఇందులో భాగంగా కడ్తాల్‌ మండలం రావిచేడ్‌ గ్రామ సమీపంలోని గుట్టలో నిల్వ ఉంచిన 400 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశామన్నారు. ఒకరిని అరెస్ట్‌ చేయగా.. మరో వ్యక్తి పరారయ్యాడని ఆయన వెల్లడించారు. ఇరువురి వద్ద 12 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని సీజ్‌ చేశామని, 4 కేసులు నమోదు చేశామని వివరించారు. నిషేధించిన నాటు సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్‌ ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌, హెడ్‌ కానిస్టేబుల్‌ శంకర్‌, కానిస్టేబుల్స్‌ నర్సింహ, అమని, బాబు, ప్రవీణ్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సిబ్బంది తదితరులు ఉన్నారు.



నాటు సారా తయారీ సామగ్రితో పట్టుబడిన వ్యక్తి

పెట్టుబడులు పెట్టండి..

అభివృద్ధికి సహకరించండి

- స్పీకర్‌ ప్రసాద్‌ కుమార్‌

శంకర్‌పల్లి: పెట్టుబడి దారులు వికారాబాద్‌ వైపు దృష్టి సారించి, అభివృద్ధికి సహకరించాలని స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌కుమార్‌ అన్నారు. ఆదివారం ఆయన ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి శంకర్‌పల్లి మండలం చెందిప్ప గ్రామంలో వివాంట బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం స్పీకర్‌ మాట్లాడారు. వివాంట ఎండీ శ్రీనివాస్‌ రావు అనేక సామాజిక కార్యక్రమాలు చేపడుతుంటారని, వారు చేసే ప్రాజెక్టులు సైతం ప్రభుత్వ విధి విధానాలకు లోబడి ఉంటాయని తెలిపారు. ఇదిలా ఉండగా.. రాబోయే ఐదేళ్లలో వికారాబాద్‌ అద్భుతమైన ప్రగతి సాధించనున్నట్లు స్పీకర్‌ స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కాలె మాట్లాడుతూ.. శంకర్‌పల్లి పట్టణం హైదరాబాద్‌ మహానగరానికి చేరువలో ఉందని, భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర కాలుష్య బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్‌ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్‌, రాష్ట్ర అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం నాయకులు, తొండ రవి, ఉదయ్‌మోహన్‌రెడ్డి, దేవ్లానాయక్‌, జనార్దన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, పలువురు బిల్డర్లు పాల్గొన్నారు.



బ్రోచర్‌ ఆవిష్కరిస్తున్న స్పీకర్‌ ప్రసాద్‌కుమార్‌, ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

ఆశా జనకంగా పంటలు

అడపాదడపా కురుస్తున్న వర్షాలతో హర్షం వ్యక్తంచేస్తున్న రైతులు



దుద్యాల్‌లో కలుపు తీతలో కూలీలు

దుద్యాల్‌: మృగశిర కార్తెలో కురిసిన వర్షంతో రైతన్నలు సాగు పనులు ముమ్మరం చేశారు. పొలాల్లో విత్తులు విత్తారు. ఆ తరువాత వరుణుడు ముఖం చాటేయడంతో తడి ఉన్న పొలాల్లో విత్తనం మొలకెత్తగా.. తడిలేని చోట మట్టిలోనే ఉండిపోయాయి. ఆ తర్వాత ఆరుద్ర కార్తెలో పడిన వానతో ఆ విత్తనాలు కూడా పుడమి తల్లి ఒడిలో చిగురించాయి. అనంతరం వారం రోజులుగా అడపాదడప కురుస్తున్న వర్షాలతో మొక్కల ఎదుగుదలకు ప్రాణం పోసినట్లు అయింది. దీంతో అవి ఏపుగా పెరుగుతూ పంటలు ఆశా జనకంగా కనిపిస్తున్నాయని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న, పత్తి, బెబ్బరు, కందులు వంటి తదితర పంటల్లో రైతులు కలుపు తీత పనులు ప్రారంభించారు. అది పూర్తయిన అనంతరం మిగతా పనుల్లో బిజీగా మారారు.

మండలంలో భారీ వర్షం..

మండల పరిధిలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షం.. పంటలకు బాగా ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు. సీజన్‌ ప్రారంభం నుంచి కాలం కాక ఇబ్బంది పడుతున్న తమకు.. ప్రస్తుతం వర్షం ఆనందాన్ని కలిగించిందని చెప్పారు. ప్రస్తుత పంటలు ఈ సమయంలోనే వృద్ధి చెందుతాయని, మందులు పిచికారీ చేసేందుకు ఇదే అనువైన సమయం అని వెల్లడించారు.



చెట్టుపల్లి తండాలో బెబ్బరు పంట

'లయన్స్‌' సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

తాండూరు: సామాజిక సేవలో లయన్స్‌ క్లబ్‌ పనితీరు అభినందనీయమని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎంపీటీ ఫంక్షన్‌ హాల్‌లో లయన్స్‌ క్లబ్‌ 50వ గోల్డెన్‌ జూబ్లీ నూతన కార్యవర్గాన్ని నియమించగా.. వారు ప్రమాణ స్వీకారం చేశారు. లయన్స్‌క్లబ్‌ తాండూరు అధ్యక్షుడిగా రొంపల్లి సంతోష్‌కుమార్‌, కో ఆర్డినేటర్‌గా యద్రామి బస్సప్ప, ఉపాధ్యక్షులుగా మురళీమోహన్‌నామాజీ, మల్లేపల్లి మధుసూదన్‌, మహ్మద్‌ యూసూఫ్‌, కార్యదర్శిగా గాజుల వీరప్రసాద్‌, సంయుక్త కార్యదర్శిగా మల్లారెడ్డి, కోశాధికారిగా మహ్మద్‌ ఆసద్‌, అలీ, మెంబర్‌షిప్‌ కమిటీ చైర్మన్‌గా శ్రీధర్‌, క్లబ్‌ మార్కెటింగ్‌ చైర్మన్‌గా వరప్రసాద్‌ గనాతే, క్లబ్‌ అడ్మినిస్ట్రేటర్‌గా సల్లా దమోదర్‌, క్లబ్‌ కోఆర్డినేటర్‌గా ఓం ప్రకాష్‌ సోమాని, క్లబ్‌ సర్వీస్‌ చైర్మన్‌గా కె.చంద్రశేఖర్‌, కార్యవర్గ సభ్యులను నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సమాజంలో ఉత్తమ సేవ అందించడం లయన్స్‌ క్లబ్‌కే సాధ్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ స్వప్నపరిమళ్‌, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



సంతోష్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

నమ్మించి.. మోసగించిన హెచ్‌ఎండీఏ!



సమావేశంలో మాట్లాడుతున్న ప్లాట్ల కొనుగోలుదారులు

- ప్లాట్లు విక్రయించి.. అభివృద్ధి మరిచిన అధికారులు
- రుణాలు తెచ్చి స్థలాలు కొన్నాం
- అప్పులు కట్టలేక మానసిక క్షోభ అనుభవిస్తున్నాం
- తొర్రూర్‌ లే అవుట్‌ ప్లాట్ల కొనుగోలుదారుల ఆవేదన

తుర్కయంజాల్‌/హయత్‌నగర్‌: 'హైదరాబాద్‌ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) లే అవుట్‌ అన్న నమ్మకంతో రూ.కోట్లు పోసి ప్లాట్లను వేలంలో పోటీ పడి కొనుగోలు చేశాం. ప్రభుత్వం ప్లాట్లను విక్రయించిందే కానీ.. నిబంధనల ప్రకారం మేము కొన్న స్థలాల(లే అవుట్‌)ను అభివృద్ధి చేయకుండా.. రెండున్నర సంవత్సరాలుగా ఇబ్బందులకు గురిచేస్తోంది. నమ్మించి మోసం చేసింది' అని నివాస స్థలాల కొనుగోలు దారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. జవాబుదారీతనం లేని అధికారుల నిర్లక్ష్యం కారణంగా స్థలం కొన్నవారు నష్టపోతున్నారని రాక్‌హిల్స్‌ కౌంటి వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు కొండ్రు పురుషోత్తం ఆరోపించారు. ఆదివారం తొర్రూర్‌లో నిర్వహించిన సమావేశంలో ప్లాట్ల కొనుగోలు దారులు మాట్లాడారు. అబ్దుల్లాపూర్‌మెట్‌ మండలం తొర్రూర్‌ గ్రామంలోని సర్వే నంబర్‌ 383/1లో 2022 నవంబర్‌లో నగర అభివృద్ధి సంస్థ అధికారులు లే అవుట్‌ చేశారని తెలిపారు. ఈ వేలం ద్వారా 392 ప్లాట్లను విక్రయించి రూ.500 కోట్లను గడించిందని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం 18 నెలల లోపు మౌలిక వసతులైన రోడ్డు, తాగునీరు, విద్యుత్‌, డ్రైనేజీ వంటి వాటిని కల్పించాల్సి ఉంటుంది. కానీ 28 నెలలు గడిచినా ఎలాంటి పురోగతి లేదని విమర్శించారు.

విన్నవించినా.. వినడం లేదు

ఇదే విషయమై హెచ్‌ఎండీఏ ఎస్టేట్‌ అధికారి వీరారెడ్డి, ప్లానింగ్‌ డైరెక్టర్‌ కె.శ్రీనివాస్‌, చీఫ్‌ ఇంజినీర్‌ పరం జ్యోతిని కలిసి పలుమార్లు వినతిపత్రం అందజేసినా ఫలితం లేదని కొనుగోలు దారులు ఆరోపించారు. ఈ ఏడాది జూన్‌ 15వ తేదీ నాటికి పనులు పూర్తి కావాల్సి ఉన్నా.. అవి నత్తనడకన కొనసాగుతున్నాయన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు పొంది, ప్లాట్లు కొని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సకాలంలో పనులు పూర్తి కాకపోవడంతో అధిక వడ్డీ చెల్లించలేక మానసిక క్షోభ అనుభవిస్తున్నామని వాపోయారు.

ప్రజా ప్రయోజన స్థలాలపై కబ్జాకోరుల నజర్‌

అధికారుల అలసత్వం కారణంగా వెంచర్‌లో ప్రజా ప్రయోజనార్థం వదిలిన స్థలాలపై ఆక్రమణ దారుల కళ్లు పడ్డాయని, వాటిని అన్యాక్రాంతం చేసే ప్రయత్నం చేస్తున్నా.. ఎవరూ పట్టించుకోవటం లేదని పలువురు ఆరోపించారు. నెలలు గడుస్తున్నా ప్రభుత్వం, హెచ్‌ఎండీఏ స్పందించకపోవడంతో కోర్టును ఆశ్రయించామని తెలిపారు. న్యాయస్థానం ఆదేశాల ప్రకారం మరో 2 నెలల్లో పనులు పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ, ఇక్కడ నిర్లక్ష్యమే రాజ్యమేలుతుందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దీనిపై స్పందించి, వెంటనే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్లాట్ల కొనుగోలుదారులు కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అనిల్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెల్‌బోర్న్‌లో బోనాల సంబరాలు

ఇబ్రహీంపట్నం రూరల్‌: ఆషాఢ మాసం బోనాల సంబురాలు ప్రారంభమయ్యాయి. దేశంతో పాటు ఆస్ట్రేలియాలో ప్రవాస భారతీయులు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను ఘనంగా జరుపుకొంటారు. గ్రామదేవతలకు బోనాలు సమర్పించి, తొట్టెలను ఊరేగిస్తారు. మెల్‌బోర్న్‌లో ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి గ్రామానికి చెందిన కొమ్మిడి సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలను నిర్వహించారు. వీరితో పాటు పట్నం మండల రవీందర్‌రెడ్డి, విష్ణు పాల్గొన్నారు.



బోనాల వేడుకలో పోల్కంపల్లి యువకులు

మాల్‌లో బెల్లం పట్టివేత

యాచారం: నాగార్జునసాగర్‌–హైదరాబాద్‌ రహదారిపై మాల్‌ మార్కెట్‌ సమీపంలో ఆదివారం 120 కిలోల బెల్లాన్ని పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గుర్తు తెలియని వ్యక్తి కారులో హైదరాబాద్‌ నుంచి మాల్‌కు బెల్లాన్ని తరలిస్తున్నాడు. ఈ క్రమంలో మాల్‌ సమీపంలో వేగంగా వెళ్తున్న కారు పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన డ్రైవర్‌ పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించగా.. కారులో బెల్లం ఉన్నట్లు గుర్తించారు. బెల్లాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.